క్లుప్తంగా

సాయం కోసం సంప్రదించండి

నిర్మల్‌టౌన్: భారీవర్షాలకు నిర్మల్ పట్టణంలోని పలు వార్డులు పూర్తిగా జలమయమయ్యాయని అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు బద్రి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కనపర్తి విఘ్నేష్ అన్నారు. గురువారం నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు, వరదలతో ఇళ్లలోకి నీరు చేరి వంట చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్న వారికి పాలు, టిఫిన్స్ అందించేందుకు అయ్యప్ప సేవా సమితి అండగా ఉంటుందని తెలిపారు. తక్షణ సాయం కోసం 99892 41117, 96662 81117, 99512 52949 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు. సమావేశంలో సాయినాథ్, సాదం ఆనంద్, పూదరి జనార్దన్, యువరాజ్, గజేందర్, రాజు తదితరులున్నారు.

బాధితులకు 'కావేరి' అండ


పండ్లు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

నిర్మల్‌ఖిల్లా: భారీవర్షాలకు జిల్లాకేంద్రంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. గురువారం అప్పాల కావేరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లోని పేదలకు పులిహోర, పండ్లు, బిస్కెట్లు తదితర ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ అప్పాల చక్రధారి, సభ్యులు పోలీస్ భీమేష్, హనుమంతు, దీపక్, చందు, ఇమ్రాన్, అతిక్ తదితరులు పాల్గొన్నారు.

స్పందించి.. ఇసుక తొలగించి

లక్ష్మణచాంద: భారీవర్షాలకు మండలంలోని రాచాపూర్ గ్రామం నుంచి మూటాపూర్ వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో సరస్వతి కాల్వ వంతెనపై ఇసుక, మట్టి కొట్టుకురావడంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. దీంతో గురువారం రాచాపూర్ వీడీసీ సభ్యులు ట్రాక్టర్ బ్లేడ్ సాయంతో వంతెనపై ఇసుకను తొలగించి ప్రయాణికుల సమస్యను పరిష్కరించారు. మాజీ సర్పంచ్ బన్నె బోయిన పోశెట్టి, వీడీసీ సభ్యులు చిన్నయ్య, అరవింద్, రమేశ్, ముత్యం, నరేశ్, రాజశేఖర్, భీమేశ్ తదితరులు ఉన్నారు.

సలాం పోలీసన్న


వర్షంలోనే టిఫిన్ తింటున్న పోలీసులు

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి పరిధి గోదావరిలో చిక్కుకున్న పార్‌పెల్లి తండా కు చెందిన శంకర్‌ను రక్షించేందుకు పోలీసులు అహర్నిశలు శ్రమించారు. ఓవైపు విధులు నిర్వర్తిస్తూనే వర్షంలోనే గురువారం ఉదయం వర్షంలోనే నిలబడి టిఫిన్ చేశారు.

ఆవు మృతి



కుంటాల:మండలంలోని సూర్యాపూర్ గ్రామానికి చెందిన ముత్యం ఓలా శివారులోని తన చేనులో ఆవును కట్టేసి ఉంచాడు. వరద ప్రవాహంలో దుర్గామాత చెరువు అలుగులోకి కొట్టుకెళ్లి అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.30 వేల వరకు ఉంటుందని.. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

ఏఐయూకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రామయ్య

ఖానాపూర్: ఏఐయూకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఖానాపూర్‌కు చెందిన నంది రామయ్య ఎన్నికయ్యారు. ఈనెల 25, 26 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరిగిన అఖిల భారత ఐక్య రైతుసంఘం రాష్ట్ర ప్రథమ మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విప్లవోద్యమంలో చేస్తున్న పోరాటాలు గుర్తించి తనకు సీపీఐఎంఎల్ మాస్‌లైన్ అధిష్టానం బాధ్యతలు అప్పగించిందని నంది రామయ్య తెలిపారు.

దేవునిచెరువు కట్టకు గండి

నిర్మల్: సర్సాపూర్(జి) మండలంలోని భారీ వర్షాలకు దేవుని చెరువు కట్టకు గండి పడింది. నందన్ ఎక్స్ రోడ్డు వద్ద రోడ్డు కోతకు గురైంది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

శిక్షణ తరగతులు విజయవంతం చేయండి

నిర్మల్‌రూరల్: మంచిర్యాల జిల్లాలో ఈనెల 30, 31 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి వైద్య, వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సింగరి వెంకటేశ్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లాకేంద్రంలోని భగత్‌సింగ్ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు విద్యారంగానికి అనేక హామీలిచ్చి అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు భిన్నంగా పాలన కొనసాగిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు లేక ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అనుమతులు లేకుండా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇందులో రాజు, నవీన్, వెంకటేశ్, రామ్ ఉన్నారు.


భైంసాలోని టిప్పుసుల్తాన్ చౌక్ సమీపంలో రోడ్డుపై వరద


లక్ష్మణచాంద: పీచరలో కూలిన సద్గురు గీతాశ్రమం ప్రహరీ


సోన్: న్యూవెల్మల్‌లో కూలిన ఇల్లు


కుంటాల : అందకూర్ అలుగు వద్ద ఏర్పడిన బుంగ

కుండపోత వర్షం

- ఉప్పొంగిన వాగులు, వంకలు
- దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు
- నీట మునిగిన పంటలు
- స్తంభించిన రాకపోకలు

జిల్లాలో రెండురోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పట్టణాలతోపాటు గ్రామాల్లో వీధులు జలమయం కాగా పలువురి ఇళ్లలోకి వరద చేరింది. పలు చోట్ల పంటలు నీట మునగగా రోడ్లు, కల్వర్టులు కోతకు గురయ్యాయి. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు.


లోకేశ్వరం: ధర్మోర చెరువు కింద మునిగిన పంట పొలాలు


మామడ: కిషన్‌రావుపేట్ సమీపంలో వరద ప్రవాహానికి కోతకు గురైన రోడ్డు

లోకేశ్వరం: మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు 125 మి.మీ వర్షం కురిసినట్లు తహసీల్దార్ సర్ఫరాజ్ నవాబ్ తెలిపారు. లోకేశ్వరం భగీరథ చెరువు, ధర్మోరా పెద్ద చెరువు నిండి వరద గోదావరిలోకి చేరుతోంది. భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంలో మండలంలోని పుస్పూర్, బిలోలి, హవర్గా, సాథ్‌గాం, హద్‌గాం గ్రామాల్లోని పంటలు మునిగాయి. కిష్టాపూర్ సమీపంలో హవర్గ- కిష్టాపూర్ లోలెవల్ వంతెనపై నుంచి వరద పారడంతో రాకపోకలు నిలిచాయి. ఎంపీడీవో సోలమాన్‌రాజ్, ఎస్సై అశోక్ పర్యవేక్షిస్తున్నారు.
కడెం :మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ సమీపంలో వంతెన వద్ద రోడ్డు కోతకు గురైంది.
బాసర: బాసరలోని గోదావరి నది స్నాన ఘట్టాల వద్దకు ఎవరిని అనుమతించడం లేదు. ఘట్టాలపై బారికేడ్లు ఏర్పాటు చేసి అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మండలంలోని ఓని, కీర్గుల్ గ్రామాలకు రాకపోకలు నిలిపివేశారు. బాసరలోని బిద్రెల్లి వాగు మునిగిపోగా బిద్రెల్లి–టాక్లీ మధ్యలో రాకపోకలు నిలిచిపోయాయి. బాసరలోని శారదనగర్, వేంకటేశ్వర కాలనీ, కళ్యాణ మండపం ప్రాంతాలు జలమయ్యాయి. పలు కాలనీల్లోకి వరద చేరింది. డీఎల్‌పీవో సుదర్శన్, తహసీల్దార్ పవన్‌చంద్ర, ఎస్సై శ్రీనివాస్ తదితరులు పరిస్థితి సమీక్షిస్తున్నారు.
భైంసారూరల్: మండలంలోని దేగాం–ఇలేగాం గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ వంతెన నీటమునిగింది. వానల్‌పాడ్, సుంక్లి, తిమ్మాపూర్, పేండ్‌పెల్లి గ్రామాల్లో చెరువులు నిండాయి.
తానూరు: మండలంలోని ఝరి(బి) వద్ద లోలెవల్ వంతెనపై వరద ప్రవహించడంతో ఝరి(బి), ఝరి(బి)తండా, మహారాష్ట్రలోని బోంతి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బోల్సా సట్వాజీ వాగు, ఎల్వత్, వాడవన గ్రామాల్లో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎంపీడీవో నసీరొద్దీన్, ఎస్సై షేక్ జుబేర్ వరద పరిశీలించారు. ఝరి(బి) గ్రామ సమీపంలో లోలెవల్ వంతెన వద్ద హైలెవల్ వంతెన నిర్మించేలా చర్యలు తీసుకుంటామని మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. గురువారం లోలెవల్ వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరదను పరిశీలించారు. నాయకులు మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, నాయకులు పోతారెడ్డి తదితరులు ఉన్నారు.
సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో సరస్వతి కాల్వకు గండి పడింది. అదే గ్రామంలో బొడ్డు సురేందర్ ఇల్లు, కూచంపల్లిలో ప్రహరీ కూలిందని తహసీల్దార్ మల్లేశ్ రెడ్డి, ఎస్సై గోపి తెలిపారు. ఇల్లు కూలిన కుటుంబానికి ప్రాథమిక పాఠశాలలో పునరావాసం కల్పించినట్లు కార్యదర్శి భూపాల్ రెడ్డి తెలిపారు. భారీ వర్షాలకు ఒక దూడ మరణించింది. కూచన్‌పల్లి–ధర్మారం, బొప్పారం–సోన్, మాదాపూర్–జాఫ్రపూర్ వెళ్లే రోడ్లు దారి కోతకు గురయ్యాయి.
పెంబి: మండలంలోని కడెం, దోత్తి వాగులు పొంగడంతో దాదాపుగా 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం సాయంత్రం తులసిపేట గ్రామానికి చెందిన రాథోడ్ వినోద్ ట్రాక్టర్ కడెం వాగు ఇసుకలో దిగబడి వరద ధాటికి మునిగిపోయింది. గురువారం మరో ట్రాక్టర్ సాయంతో బయటకు తీశారు.
లక్ష్మణచాంద: తిర్పెల్లి వాగుపై వంతెన దెబ్బతినగా రాకపోకలు నిలిచిపోయాయి. పీచరలోని సద్గురు గీతాశ్రమం ప్రహరీ, మండలకేంద్రంలోని కేజీబీవీ ప్రహరీ కూలిపోయాయి. రాచాపూర్‌లో రుద్రజడ అనురాధ ఇల్లు పాక్షికంగా కూలింది.
భైంసాటౌన్: పట్టణంలో టిప్పుసుల్తాన్ చౌక్, వివేకానంద చౌక్ వద్ద రోడ్డు నీట మునగగా, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సీఐ గోపినాథ్, సిబ్బంది ట్రాఫిక్ మళ్లింపు చర్యలు తీసుకున్నారు. యూనియన్ బ్యాంక్–కుభీర్ మార్గంలో డ్రైనేజీ నీరంతా రోడ్డుపై ప్రవహించింది.
సారంగపూర్: స్వర్ణ ప్రాజెక్ట్ గేట్లను ఎత్తడంతో పరివాహక ప్రాంతాలకు నష్టం వాటిల్లింది. మండలంలోని వైకుంటపూర్, కంకెట, సారంగపూర్, జామ్ గ్రామాల రోడ్లు దెబ్బతిన్నాయి. వంజర్ సమీపంలో దెబ్బతిన్న రోడ్డును ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. సర్వే నిర్వహించి నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని సారంగపూర్, జామ్ గ్రామాల్లో మాజీ మంత్రి ఐకేరెడ్డి పరిశీలించారు.
కుంటాల: మండలంలోని కల్లూరు–కుంటాల వెళ్లే మార్గంలో అందకూర్ అలుగు వద్ద రోడ్డుపై బుంగ ఏర్పడింది. కుంటాల–అంబకంటి గ్రామాల మధ్య కాళేశ్వరం కెనాల్ సమీపాన రోడ్డు కోతకు గురవగా సారంగాపూర్, గొల్లమాడ గ్రామాలకు బస్సులు నడవలేదు. సూర్యాపూర్ రాజరాజేశ్వరాలయానికి వెళ్లే రోడ్డు కొట్టుకుపోయింది. తహసీల్దార్ కమల్‌సింగ్, ఎంపీడీవో అల్లాడి వనజ, ఎస్సై అశోక్, ఎంపీవో రహీంఖాన్ ప్రజలను అప్రమత్తం చేశారు. పంటలు నీట మునిగాయి.
దస్తురాబాద్: మండలంలోని బుట్టాపూర్, రేవోజీపేట, దస్తురాబాద్, మల్లాపూర్, గోడిసీర్యాల, మున్యాల గ్రామ పంచాయతీ పరిధి గ్రామాల్లోకి వరద చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. బుట్టాపూర్‌లో పలువురి ఇళ్లలోకి నీరు చేరటంతో తహసీల్దార్ విశ్వంబర్, పోలీసులు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.
దిలావర్‌పూర్: మండల కేంద్రం నుంచి గుండంపల్లి, బన్సపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. మాతాన్నపూర్ణేశ్వరీ కదిలి ఆలయానికి వెళ్లే మాడేగాం ఘాట్ రోడ్డుపై రాళ్లు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్, ఎస్సై రవీందర్, అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు సూచనలు చేశారు.


కడెం: లక్ష్మీపూర్ వద్ద..

ఖానాపూర్: వరద ప్రభావిత ప్రాంతాలను మండల ప్రత్యేక అధికారి జీవరత్నం, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రత్నాకర్‌రావు, కమిషనర్ సుందర్ సింగ్, ఎస్సై రాహుల్ గైక్వాడ్‌లు కాలనీలను సందర్శించారు. తర్లపాడ్‌లోని లోతట్టు ప్రాంత ప్రజలను ప్రభుత్వ పాఠశాలకు తరలించి పునరావాసంలో భాగంగా 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. పాతతర్లపాడ్ గ్రామానికి వెళ్లే దారి మూసి వేయించారు. పరివాహక గ్రామాల్లో అధికారులు పర్యటించి అవగాహన కల్పించారు. మస్కాపూర్‌లో మధురనగర్ కాలనీ జల దిగ్బంధమైంది. ఖానాపూర్ శ్రీరాంనగర్ కాలనీలో తీరం వద్ద ఉన్న శ్మశానవాటికను వరద ముంచెత్తింది.
మామడ: మండలకేంద్రంలో గురువారం 8.2 సెంటీమీటర్ల వర్షం కురిసింది. లోతట్టు కాలనీల్లో వరద చేరింది. కిషన్‌రావుపేట్, శాంతినగర్‌తండా గ్రామాల మధ్య ఉన్న రోడ్డు కోతకు గురైంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి.


దిలావర్‌పూర్ : కోతకు గురై ప్రమాద భరితంగా కదిలి-మాదేగాం ఘాట్ రోడ్డు


సారంగపూర్: కోతకు గురైన వైకుంఠపూర్- కంకెట రోడ్డు


బాసర: బిద్రెల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లోకి చేరిన వరద


దస్తురాబాద్: బుట్టాపూర్‌లో ఇళ్లలో చేరిన వరదను స్థానికులతో కలిసి పరిశీలిస్తున్న అధికారులు


తానూరు: ఝరి(బి) వద్ద లోలెవల్ వంతెన పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, నాయకులు

అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు


సోన్: కూచన్‌పల్లిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి


కుంటాల: అంబకంటి వద్ద కోతకు గురైన రోడ్డు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

- ఇబ్బందులుంటే సంప్రదించాలి
- ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, రామారావు

సోన్: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలెవరూ అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సోన్ మండలంలో పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాలతోపాటు కూచన్‌పల్లి–ధర్మారం గ్రామాల మధ్య తెగిన రోడ్డు, మాదాపూర్ బ్రిడ్జి, నీట మునిగిన పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా వరద ఉధృతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, మండల పరిషత్ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, మేడిసెమ్మ రాజు, మండలాధ్యక్షుడు మార గంగారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.
నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని వరద ప్రభావిత ప్రాంతాలైన సోఫీనగర్, శివాజీచౌక్, బోయవాడ, మంజులాపూర్ కాలనీల్లో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పర్యటించారు. బాధితులను పరామర్శించి వరద నీటి సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.
కుంటాల: మండలంలోని కుంటాల–అంబకంటి వెళ్లే మార్గంలో కోతకు గురైన రోడ్డును ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పరిశీలించారు. ఏవైనా ఇబ్బందులుంటే అధికారులను సంప్రదించాలని సూచించారు. గజ్జారాం, బీజేపీ మండల కన్వీనర్ పసుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ వైఫల్యంతోనే ఇబ్బంది'

ఖానాపూర్: పట్టణంలోని పలు కాలనీల్లో ప్రభుత్వం డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మించకపోవడంతోనే వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గౌరీకర్ రాజు, యూత్ పట్టణ అధ్యక్షుడు ఆడెపు రవి అన్నారు. గురువారం పట్టణంలోని పద్మావతినగర్ కాలనీ పరిధి బుడగజంగం వాడలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. భారీ వర్షాలతో వరద ఇళ్లలోకి రావడంతో ప్రజలు నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తోందని పేర్కొన్నారు.

జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు

లక్ష్మణచాంద: గోదావరిలో చిక్కుకున్న పార్‌పెల్లి తండా వాసి శంకర్‌ను కాపాడిన కలెక్టర్, ఎస్పీ, ఉన్నతాధికారులు, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది తదితర జిల్లా యంత్రాంగానికి మండల ప్రజల తరఫున కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు. గురువారం మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఇందులో నిర్మల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్, నాయకులు సిరాజ్, రవి, నాగేష్, సురేశ్, అజ్గర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన

కుంటాల: మండలంలోని గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో గురువారం ఓటరు జాబితాను ప్రదర్శించారు. అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని డీఎల్పీవో సుదర్శన్ సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు


రాంపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు

దస్తురాబాద్: వరద ఉధృతి పెరిగితే గోదావరి తీర ప్రాంతాలైన భూత్కూర్, రాంపూర్, మున్యాల, గొడిసీర్యాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సూచించారు. ఎవరూ అధైర్యపడొద్దుని.. అండగా ఉంటామని భరోసానిచ్చారు. గురువారం రాత్రి మండలంలోని బుట్టాపూర్, మున్యాల, రాంపూర్ గ్రామాల్లో పర్యటించారు. తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉంటూ.. అధికారుల సూచనలు పాటించాలని పేర్కొన్నారు. తహసీల్దార్ విశ్వంభర్, మాజీ ఎంపీపీ కిషన్, నాయకులు రమేశ్‌రావు, నరేశ్‌రెడ్డి, ఆనంద్, స్వామి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- డీఈవో రామారావు


కేజీబీవీలో వంటగది పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేస్తున్న డీఈవో రామారావు

లక్ష్మణచాంద: విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని డీఈవో రామారావు కేజీబీవీ అధికారులకు సూచించారు. భారీ వర్షాలకు మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల ప్రహరీ కూలిపోయింది. డీఈవో దానిని గురువారం పరిశీలించారు. ప్రహరీ త్వరగా పునర్నిర్మించేలాగా చర్యలు చేపడుతాన్నారు. అనంతరం కిచెన్ గది, స్టోర్, తరగతి గదులను వెళ్లారు. విద్యార్థులతో మాట్లాడి వర్షాలతో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఇంటర్, పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈవో అశోక్‌వర్మ, డీసీఈబీ ఇన్‌చార్జి భానుప్రకాశ్, స్పెషల్ ఆఫీసర్ నవిత, సీఆర్పీలు మహేంధర్, సుధాకర్ ఉన్నారు.

బొజ్జ గణపయ్య.. ప్రణామం


కుభీర్‌లోని యాదవ సంఘ భవనంలో..


కడెం: లింగాపూర్‌లో మండపానికి తీసుకొస్తూ..


లోకేశ్వరం: ధర్మోరలో పూజలు చేస్తున్న భక్తులు

జిల్లావ్యాప్తంగా బుధవారం వినాయకచవితి ఘనంగా నిర్వహించారు. అలంకరించిన మండపాల వద్దకు వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఇళ్ల ముందు గుండ్రాలు గీసి బొజ్జ గణపయ్యకు స్వాగతం పలికారు. పర్యావరణ హితంలో భాగంగా ఎక్కువ మంది మట్టి ప్రతిమలనే ప్రతిష్ఠించి పూజలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్

కుక్కల దాడిలో 20 గొర్రెలు మృతి


గొర్రెల కళేబరాలు పరిశీలిస్తున్న స్థానికులు

దిలావర్‌పూర్: మండలంలోని సముందర్ పల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన రత్నాపూర్ కాండ్లిలో మంగళవారం రాత్రి గొర్రెల మందపై కుక్కలు దాడి చేశాయి. గొర్రెల యజమాని మినుగురు శ్రీధర్ ఇంట్లో నిద్రిస్తుండగా పదుల సంఖ్యలో వచ్చిన కుక్కలు మందపై దాడి చేయగా దాదాపు 20 గొర్రెలు మృతి చెందాయి. ఘటనా స్థలాన్ని పశువైద్యాధికారి గోవర్ధన్ పరిశీలించారు. గొర్రెల విలువ దాదాపుగా లక్ష రూపాయలు ఉంటుందని బాధితుడు వాపోయాడు.